బైక్‌ ఢీకొని ఏఎస్‌ఐకి గాయాలు

సనత్‌నగర్‌: బైక్‌పై వెళ్తున్న ఏఎస్‌ఐను గుర్తుతెలియని మరో బైక్‌ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన సనత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..వెంకటరమణకాలనీ శేషాద్రి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే మాధవరావు (57) ఎస్సార్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈనెల 4న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎస్సార్‌నగర్‌లో చెక్‌పోస్టు విధులు ముగించుకుని మూసాపేట వైపు వెళ్తుండగా మెట్రో పిల్లర్‌ నంబర్‌ 962 వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన బైక్‌ బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో మాధవరావు ఎడమ కాలి మోకాలికి తీవ్ర గాయమై రక్తస్రావం అయ్యింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్‌: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట రసూల్‌పురాకు చెందిన శ్రీకాంత్‌ (28) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శ్రీకాంత్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. ఈనెల 3న శ్రీకాంత్‌ మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె 4న సమీపంలోనే నివసించే తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. అదేరోజు సాయంత్రం భార్యకు ఫోన్‌ చేసి మద్యం కోసం డబ్బు ఇవ్వమని అడిగాడు. అందుకు ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీకాంత్‌ ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం శ్రీకాంత్‌ గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి అతని తల్లి లక్ష్మి పక్కింటి వారి సాయంతో వెంటిలేటర్‌లో నుంచి చూడగా ఉరేసుకుని కనిపించాడు. ఈ మేరకు తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆర్థిక సమస్యలతో పాటు మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం స్వాధీనం



చిలకలగూడ : గుర్తుతెలియని మహిళ మృతదేహం స్వాధీనం చేసుకున్న ఘటన సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో జరిగింది. చిలకలగూడ ఎస్‌ఐ సబిత తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీ ఆస్పత్రి వెయిటింగ్‌ హాల్‌ సమీపంలో మహిళ అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది సదరు మహిళను అత్యవసర విభాగంలో చేర్పించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి వద్ద ఆధారాలు లభించలేదని, కుటుంబ సభ్యులు , బంధువులు గుర్తించేందుకు వీలుగా మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సబిత తెలిపారు.

బాలుడిపై దాడి

సనత్‌నగర్‌: కదులుతున్న డీసీఎంపైకి బాలుడిని తోసేసి దాడికి పాల్పడిన వ్యక్తిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట రసూల్‌పురాకు చెందిన మొహమ్మద్‌ ఇర్షాద్‌ కుమారుడు (17) తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అదే ప్రాంతంలో నివసించే షేక్‌ మహబూబ్‌ బాలుడిపై అకారణంగా దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలుడు అతని నుంచి తప్పించుకునే క్రమంలో అటువైపే వస్తున్న ఓ డీసీఎం పైకి తోసేశాడు. దీంతో డీసీఎం ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. అయినా కూడా బాలుడిపై దాడి చేస్తుండడంతో తీవ్ర రక్తస్రావం కావడంతో చుట్టుపక్కల వారు గమనించి బాలుడిని రక్షించారు. బాలుడి తండ్రి గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేయగా బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలని వినతి

లాలాపేట: లాలాపేట ప్రకాశ్‌ గల్లీలో బీటీ రోడ్డు వేయాలని కోరుతూ యంగ్‌ మెన్స్‌ యూత్‌ అసోసియేషన్‌ నాయకులు స్థానికుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ ప్రవీణ్‌ మాట్లాడుతూ.. లాలాపేట గడి స్కూల్‌ సమీపంలో (ఇంటి నంబర్‌ 12–1–334/6) ప్రకాశ్‌ గల్లీలో దాదాపు 20 ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందన్నారు. వెంటనే స్పందించి రోడ్డు వేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో స్థానికులు మీర్‌ హుస్సేన్‌ అలీ, రేష్మా, లక్ష్మీకాంత్‌, కృష్ణ, సౌమ్య తదితరులు ఉన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని..

అడ్డగుట్ట: ప్రైవేట్‌ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్‌. లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు సీఆర్పీఎఫ్‌, తల్లుల సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతినిధులు జి. భాగ్యలక్ష్మి, ప్రవీణ్‌, నక్క శోభ ఉన్నారు.

టీజీ లాసెట్‌కు 79.02 శాతం మంది హాజరు

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ లాసెట్‌–2025, పీజీ లాసెట్‌కు 79.02 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు కన్వీనర్‌ ప్రొ.విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 76 కేంద్రాల్లో 57, 715 మందికి 45,609 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. (2025–26) ఈ విద్యా సంవత్సరానికి 3 సం, 5 సం. ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశానికి ఎంట్రన్స్‌ టెస్ట్‌ నిర్వహించినట్లు పేర్కొన్నారు. అయితే సాంకేతిక కారణాల వలన పలు పరీక్షా కేంద్రాల్లో సుమారు 50 నిమిషాలు ఆలస్యంగా పరీక్ష షురూ అయ్యింది. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన పరీక్ష 5.30 ముగియాల్సి ఉండగా 6.20 వరకు కొనసాగింది.

నేటి బక్రీద్‌కు సర్వం సిద్ధం

చిలకలగూడ ఈద్గా మైదానంలో ఏర్పాట్లు పూర్తి | జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పొట్టేళ్ల విక్రయ కేంద్రాలు



చిలకలగూడ : నేటి బక్రీద్‌ పండుగకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. చిలకలగూడ బడేమసీద్‌తో పాటు పలు ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. చిలకలగూడ ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే జీహెచ్‌ఎంసీ, స్థానిక పోలీసులు ఆధ్వర్యంలో మున్సిపల్‌ కాంప్లెక్స్‌ మైదానంలో గొర్రె పొట్టేళ్లను విక్రయకేంద్రాలను ఏర్పాటు చేశారు. బక్రీద్‌ను పురస్కరించుకుని పొట్టేళ్లను ఖుర్బానీ ఇస్తారు. వాటి మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగం తాము తీసుకుని, మరో భాగాన్ని సన్నిహితులు, బంధుమిత్రులకు, మిగిలిన భాగాన్ని నిరుపేదలకు దానం చేస్తారు.



చిలకలగూడ బడేమసీదు వద్ద ప్లాస్టిక్‌ కవర్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్‌ హేమ

పటిష్ట బందోబస్తు ..

ఈస్ట్‌జోన్‌ డీసీపీ బాలస్వామి, చిలకలగూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు చేపట్టామని చిలకలగూడ ఎస్‌హెచ్‌ఓ అనుదీప్‌ తెలిపారు. ఆయా మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రజలంతా మతసామరస్యంతో మెలగాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

బక్రీదు సందర్భంగా పారిశుద్ధ్య నిర్వహణపై జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మేకలు, గొర్రె పోట్టేళ్ల వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్‌ యార్డుకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలను అందుబాటులో ఉంచారు. సీతాఫల్‌మండి, మెట్టుగూడ కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత పలు ప్రాంతాల్లో వ్యర్థాల కోసం ప్లాస్టిక్‌ కవర్లను ఉచితంగా పంపిణీ చేశారు. పారిశుద్ధ్య బృందాలను రంగంలోకి దింపినట్లు జీహెచ్‌ఎంసీ డీసీ సుభాష్‌రావు తెలిపారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

లాలాపేట: బక్రీద్‌ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలత సూచించారు. ఈ మేరకు తార్నాకలోని తన నివాసం వద్ద ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డితో కలిసి ముస్లింలకు పాలీథిన్‌ కవర్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్‌ మాట్లాడుతూ.. జంతు వ్యర్థాలను రోడ్లపై వేయకుండా పాలీథిన్‌ కవర్లలో వేసి ఇంటింటికీ చెత్త సేకరించే వారికి అందించాలని కోరారు. కార్యక్రమంలో సానిటేషన్‌ డీఈ వెంకటేష్‌, ఎస్‌ఎఫ్‌ఏలు, స్థానిక ముస్లింలు పాల్గొన్నారు.



పాలీథిన్‌ కవర్లను అందజేస్తున్న డిప్యూటీ మేయర్‌ శ్రీలత

బక్రీద్‌ సందడి

సనత్‌నగర్‌: నియోజకవర్గంలో బక్రీద్‌ పండుగను పురస్కరించుకుని గొర్రెలు, పొట్టేళ్లు, మేకల అమ్మకాలు శుక్రవారం జోరుగా సాగాయి. ఎర్రగడ్డ–సనత్‌నగర్‌ రహదారితో పాటు బీకేగూడ, అమీర్‌పేట, బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేటలో ప్రత్యేకంగా టెంట్లు ఏర్పాటు చేసి విక్రయాలు జరిపారు. బక్రీద్‌కు 3 రోజుల ముందు నుంచే తాత్కాలిక విక్రయశాలలు ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాలు, గ్రామాల నుంచి గొర్రె, మేక పొట్టేళ్లు తీసుకువచ్చి విక్రయాలు జరుపుతుంటారు. అలాగే బక్రీద్‌ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని శాంతి కమిటీల ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.



గాంధీలో ఇంటర్‌వెన్షన్‌ ప్రొసీడర్స్‌ షురూ

దీర్ఘకాల నొప్పుల నుంచి సత్వరమే ఉపశమనం



గాంధీఆస్పత్రి : దీర్ఘకాలంగా బాధిస్తున్న నొప్పులకు చికిత్స నిర్వహించి చిటికెలో ఉపశమనం కలిగించే అత్యాధునిక వైద్య పద్ధతులు సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చాయి. గాంధీ అనస్తీషియా విభాగం ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన పెయిన్‌ క్లినిక్‌లో శుక్రవారం ముగ్గురు రోగులకు ఇంటర్‌వెన్షన్‌ ప్రొసీడర్స్‌ ద్వారా చికిత్స అందించినట్లు గాంధీ సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ఎన్‌ రాజకుమారి, అనస్తీషియా హెచ్‌ఓడీ ప్రొఫెసర్‌ ఆవుల మురళీధర్‌ తెలిపారు. ఒకరు తీవ్రమైన భుజం నొప్పి (ప్రొజన్‌ షోల్డర్‌), మరో ఇద్దరు కీళ్ల నొప్పులు (క్రానిక్‌ నీ ఆర్థరైటీస్‌) తో కొన్నేళ్లుగా బాధపడుతున్నారన్నారు. గాంధీ పెయిన్‌ క్లినిక్‌కు రాగా ఈ విధానంలో శస్త్రచికిత్స ఉండదని కేవలం ఇంజక్షన్లు మాత్రమే ఇస్తామని వివరించారు. ఇలాంటి చికిత్సలకు ప్రైవేట్‌, కార్పొరేట్‌ ఆస్పత్రుల్లో వేలాది రూపాయలు వసూలు చేస్తారని, ఇక్కడ ఉచితంగా నిర్వహించామని తెలిపారు. గాంధీ ఓపీ విభాగంలో సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెయిన్‌ క్లినిక్‌ అందుబాటులో ఉంటుందన్నారు. అనస్తీషియా వైద్యులు, మెడిసిన్‌ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణపతి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



నూతన చైర్మన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

రాంగోపాల్‌పేట్‌: సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ ప్రాంతంలోని గణపతి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. ప్రమాణ స్వీకారం అనంతరం ఆలయ చైర్మన్‌గా పర్ష ప్రభాకర్‌ యాదవ్‌ (అర్విండ్‌)ను సభ్యులు ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ హాజరయ్యారు. సికింద్రాబాద్‌ గణపతి ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు నూతన ధర్మకర్తల మండలి సభ్యులు మరింత కృషి చేయాలని నూతన చైర్మన్‌ మాట్లాడుతూ.. ఆలయానికి ప్రధానంగా పార్కింగ్‌ సమస్య ఉందని దానిపై దృష్టిపెడతామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతన ధర్మకర్తల మండలి సభ్యులు నరేందర్‌ యాదవ్‌, ఆంజనేయులు, మల్లేశ్‌, సంతోష్‌, రామ్‌సాయి, భిక్షపతి, నందికంటి నాగమణి, నరేందర్‌, వేణుగోపాలాచారి, అనిల్‌ యాదవ్‌, వందన, మాణిక్య ప్రభు, వంగ నరేశ్‌ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి..

లక్షల్లో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: ట్రైనీ ఎస్‌ఐని అని.. ప్రేమిస్తున్నానని..పెళ్లి చేసుకుంటానని నమ్మించి లక్షల్లో డబ్బులు దండుకుంటున్న వ్యక్తిపై ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 5 ఏళ్ల క్రితం ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన 35 ఏళ్ల యువతికి మహబూబ్‌నగర్‌కు చెందిన శివ పరిచయం అయ్యాడు. ప్రేమిస్తున్నానని ట్రైనింగ్‌ పూర్తి కాగానే పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి లోబర్చుకున్నాడు. శిక్షణ పూర్తయిన వెంటనే రూ.30 లక్షలు కట్నంగా తీసుకుని పెళ్లి జరిపిస్తామని అమ్మ పెళ్లి సంబంధాలు కూడా చూస్తోందని అబద్ధాలు చెప్పాడు. ప్రేమించిన మీ అమ్మాయినే చేసుకుంటానని, కట్నంగా రూ.15 లక్షలు ఇస్తే చాలని చెప్పాడు. ఎస్‌ఐ పోస్టింగ్‌ కోసం రూ.10 లక్షలు వసూలు చేశాడు. కొంతకాలం తర్వాత మరో రూ.6 లక్షలు వసూలు చేశాడు. అంతేగాకుండా యువతి బంగారు గొలుసు, 3 జతల చెవి దుద్దులు, సోదరి వజ్రపు ఉంగరాన్ని సైతం ప్రియుడికి ముట్టజెప్పింది. శ్రావణంలో ముహూర్తాలు పెట్టుకుందామని ప్రియురాలు కోరగా, ట్రైనింగ్‌ పూర్తయ్యాకే పెళ్లి చేసుకుంటానని వాయిదాలు వేస్తూ వచ్చాడు. దీంతో యువతి తల్లిదండ్రులు గట్టిగా నిలదీయడంతో శివ తన ప్రియురాలిని బైక్‌పై రూమ్‌కు తీసుకెళ్లాడు. ఆకలిగా ఉందని ప్రియురాలు చెప్పడంతో బిర్యానీ తెస్తానని ఫోన్‌ రూమ్‌లోనే పెట్టి బయటకు వెళ్లాడు. అతడి ఫోన్‌లోని కాంటాక్ట్స్‌ చూడగా పలువురు యువతులతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించింది. దీంతో మోసపోయాయని గ్రహించిన సదరు యువతి శివపై జూబ్లీహిల్స్‌, కొల్లూరు పోలీస్‌స్టేషన్లలో కూడా కేసులు నమోదయ్యాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా కార్పొరేటర్‌ జన్మదిన వేడుకలు

సనత్‌నగర్‌: సనత్‌నగర్‌ కార్పొరేటర్‌ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్‌ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పలువురు నేతలు, కార్యకర్తలు సనత్‌నగర్‌ ఎస్సార్టీకాలనీలోని ఆమె నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె సనత్‌నగర్‌ హనుమాన్‌ దేవస్థానం ప్రాంగణంలోని దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సుదర్శనాచార్యులు, రిపుంజయశర్మ, విజయేంద్ర కార్పొరేటర్‌ దంపతులకు ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌గౌడ్‌, ఎస్‌ఆర్‌టీ మురళి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్‌ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి దంపతులు

గాంధీలో అభయ సపోర్ట్‌ సెంటర్‌ ప్రారంభం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్‌ గాంధీ ఆస్పత్రి, భూమిక ఉమెన్స్‌ కలెక్టివ్‌ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభయ సపోర్ట్‌ సెంటర్‌ను గాంధీ సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ సీహెచ్‌ఎన్‌ రాజకుమారి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం అభయ సపోర్ట్‌ సెంటర్‌ విధివిధానాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. గైనకాలజీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్‌ రాధా, ప్రొఫెసర్‌ అజయ్‌మోహన్‌, సత్యావతి, ఆర్‌ఎంఓలు సుధార్‌సింగ్‌, కల్యాణచక్రవర్తి, యోగేందర్‌, ప్రతినిధులు అర్చనారావు, మంజుల, పద్మ, మాధవి, శాంతిప్రియ, లలిత, లక్ష్మి, మీన, సోనీ, కిన్నెర పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చెరువుల అభివృద్ధి

కంటోన్మెంట్‌: రాష్ట్ర ప్రభుత్వంఆధ్వర్యంలోనే కంటోన్మెంట్‌ పరిధిలోని రామన్నకుంట, తిరుమలగిరి చెరువులను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ తెలిపారు. కంటోన్మెంట్‌ కార్యాలయంలో హెచ్‌ఎండీఏ, కంటోన్మెంట్‌ అధికారులతో శుక్రవారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ చెరువుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి, టెండర్ల ఖరారుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. అయితే ఈ పనులకు కంటోన్మెంట్‌ బోర్డు నుంచి ఎన్‌ఓసీ ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో కంటోన్మెంట్‌ సీఈఓ మధుకర్‌ నాయక్‌, హెచ్‌ఎండీఏ చీఫ్‌ ఇంజినీర్‌ రవీంద్‌, ఈఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాలాను త్వరితగతిన నిర్మించాలి



కూల్చివేతలను పరిశీలిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్‌

రసూల్‌పురా: నాలాపై అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు వెంటనే నాలాను నిర్మించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నుంచి కంటోన్మెంట్‌ బోర్డు పరిధిలోని ప్యాట్నీ నాలాపై వెలసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలను బోర్డు నామినేటెడ్‌ సభ్యురాలు భానుక నర్మదతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణాల వల్ల 30 ఫీట్ల నాలా 10 ఫీట్లకు కుచించుకుపోయిందన్నారు. దీంతో సీబీఎస్‌నగర్‌, శ్రీలంకబస్తీ, మార్గదర్శికాలనీ విమాన నగర్‌ కాలనీ తదితర బస్తీలు, కాలనీలు ఏళ్ల తరబడి ముంపునకు గురయ్యాయని స్థానికులు, పాలకుల ఫిర్యాదు మేరకు హైడ్రా కూల్చివేతలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బిఎస్‌. శ్రీనివాస్‌, ప్యాట్నీ, విమాననగర్‌ కాలనీ అభివృద్ధి సంక్షేమ సంఘ నాయకులు వార్డు అధ్యక్షుడు అరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మావోయిస్టులు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ఏబీవీపీ నాయకులు కోరారు. మావోయిస్టుల హింసాత్మక చర్యలకు వ్యతిరేకంగా ఓయూ ఇంజినీరింగ్‌ కాలేజీ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్‌ జీవన్‌ మాట్లాడుతూ..వర్సిటీల్లోని కొందరు ప్రొఫెసర్లు తమ పిల్లలను విదేశాల్లో, కార్పొరేట్‌ విద్యాసంస్థల్లో ఉన్నత చదువులు చదివిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద విద్యార్థులకు బూటకపు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నూరిపోస్తూ వారిని అడవుల బాట పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్న ఇలాంటి ప్రొఫెసర్లపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అలివేలి రాజు, కమల్‌ సురేశ్‌, హరి ప్రసాద్‌, సంగదీప్‌, శేఖర్‌, నరేందర్‌, సాయి తేజ వినీత్‌, మనీశ్‌, సాయి, వేణు పాల్గొన్నారు.



ఐదోవార్డు బీజేపీ నూతన కార్యవర్గం

కంటోన్మెంట్‌: కంటోన్మెంట్‌లో బీజేపీని మరింత బలోపేతం చేస్తామని ఆ పార్టీ 5 వార్డు అధ్యక్షుడు బల్దా సంతోష్‌ అన్నారు. ఆ వార్డు బీజేపీ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ప్రదీప్‌ అగర్వాల్‌, నరేందర్‌, భిక్షపతి, జనరల్‌ సెక్రటరీలుగా గణేశ్‌, కోటేశ్వరరావు, సెక్రటరీలుగా చిరంజీవి, బాబు ప్రశాంత్‌, బి.మోహన్‌, భీం శంకర్‌, కోశాధికారిగా బి.శివకుమార్‌ను నియమించారు. పార్లమెంట్‌ నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్‌ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్‌ బోర్డు మాజీ సభ్యులు జన్యావుల రామకృష్ణ అసెంబ్లీ కో కన్వీనర్‌ సతీశ్‌, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మాల మహానాడు గ్రేటర్‌ అధ్యక్షుడిగా బీవీ రావు

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ మాలమహానాడు గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షుడిగా డా.బీవీ రావును (బండ వరప్రసాద రావు) నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్‌ తెలిపారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌ వెంకటస్వామి నివాసంలో శుక్రవారం నియామక పత్రం అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీవీ రావుకు పలువురు అభినందనలు తెలిపారు.

బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి

బడిబాట ప్రారంభోత్సవంలో డీఈవో రోహిణి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఈఓ రోహిణి



బడిబాట ప్రారంభోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అడ్డగుట్ట: బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలని డీఈఓ రోహిణి అన్నారు. మారేడుపల్లి మండల పరిధిలోని అడ్డగుట్ట ప్రభుత్వోన్నత పాఠశాలలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించగా, ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నామన్నారు. బస్తీబస్తీకి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యార్థులను బడుల్లో చేర్పించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం, విద్యార్థులకు స్కూల్‌ యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో బాలునాయక్‌, డిప్యూటీ ఐఓఎస్‌ మదన్‌ మోహన్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బడిబాటకు స్పందన

చిలకలగూడ : బడిబాటకు స్పందన లభించిందని దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి అన్నారు. పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం సమావేశం నిర్వహించి పిల్లలకు అడ్మిషన్‌ తీసుకున్న పలువురికి జ్ఞాపికలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రాబాద్‌ సీపీఐ కార్యదర్శి కంపల్లి శ్రీనివాస్‌, చైల్డ్‌రైట్‌ ప్రొటెక్షన్‌ ఫోరం కన్వీనర్‌ లక్ష్మీనారాయణ, తల్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు భాగ్య, ప్రతినిధులు రామలీల, వరలక్ష్మి, రమాదేవి, శోభారాణి, కొమురెల్లి బాబు, ప్రవీణ్‌, వెంకటరమణ, శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు అయేషాఅంజుమ్‌, మల్లీశ్వరీ, హసీనాబేగం, సాలెహ, షహీన్‌సుల్తానా, శిరీషా, అంగన్‌వాడీ టీచర్‌ రోజా పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో సికింద్రాబాద్‌ జోన్‌ డిప్యూటీ ఈఓ శ్రీధర్‌, ఉపాధ్యాయులు

సికింద్రాబాద్‌ జోన్‌ పరిధిలో..

సనత్‌నగర్‌: సికింద్రాబాద్‌ జోన్‌ పరిధిలో పలు ప్రాంతాల్లో బడిబాట కార్యక్రమాన్ని డిప్యూటీ ఈఓ శ్రీధర్‌ శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు గ్రామసభ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లోని బోధన, వసతులను వివరించారు. అలాగే కరపత్రాలు అందజేస్తూ బ్యానర్లు ప్రదర్శిస్తూ ఉత్సాహంగా ర్యాలీల తీశారు. సికింద్రాబాద్‌–1, సికింద్రాబాద్‌–2 మండలాల పరిధిలో 15 ఉన్నత, 34 ప్రైమరీ పాఠశాలలు, అమీర్‌పేట మండలంలో 3 ఉన్నత, 5 ప్రాథమిక పాఠశాలలు, బాలానగర్‌ మండల పరిధిలో 2 ఉన్నత, మూడు ప్రాథమిక పాఠశాలలు ఉండగా అన్ని స్కూళ్ల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని ఆరంభించారు.

గన్‌బజార్‌ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో..

రసూల్‌పురా: రసూల్‌పురాలోని గన్‌బజార్‌ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్‌ రంగనాథ్‌, గణేశ్‌, ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోయిన్‌పల్లి మార్కెట్‌ మాజీ డైరెక్టర్‌ షేక్‌ నయీం హాజరయ్యారు. ఈ సందర్భంగా బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు తాము కూడా సహకరిస్తామని నయీంతో పాటు పలువురు బస్తీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో షాహేద్‌ అలీ, యూసుఫ్‌, మజీద్‌ ఖాన్‌, నర్సింహ, సతీశ్‌ తదితరులు పాల్గొన్నారు.



పిల్లల తల్లిదండ్రులకు జ్ఞాపికలు అందిస్తున్న దృశ్యం



రసూల్‌పురాలో బడిబాట నిర్వహిస్తున్న దృశ్యం